# శ్రమదోపిడి

కనకమ్మ ఎప్పటిలాగే తెల్లవారు జామున్నే లేచి, బీడీల ఆకు కట్టలు ముందేసుకుని కత్తిరించడానికి కూర్చుంది. కత్తెరదారు పట్టించాలి – పదునుగా లేదు. కుడిచేతి వేళ్లు, భుజం తీపులు తీస్తున్నాయి. నాలుగు బావులు కాడి నుంచి నమాజ్ వినిపిస్తూన్నది. దూరంగా కోడి కూత... దగ్గరి బాదం చెట్టుమీద పక్షుల రెక్కల చప్పుడు...సగం తెరిచిన తలుపులు...చలిగాలి రివ్వున దూసుకు వస్తున్నది. బయట మసక మసక చీకటి...

రాత్రి తడిపి పెట్టిన తునికాకు కట్టల్లోంచి ఒక్కొక్క ఆకు తీసి బీడికి సరిపోయే సైజులో కత్తిరిస్తుంది. ఒక్కో ఆకును ఏటవాలుగా కత్తిరిస్తే రెండు బీడిలకు పరిమితం. మచ్చల ఆకులు, కవురుపట్టిన నల్లని ఆకులు బీడీలకు పనికిరావు. ఎన్ని బీడీలు చేస్తే అంత కూలి. వేయి బీడీలు చేస్తే నలభై నుంచి ఎనభై ఎనిమిది రూపాయల దాకా వస్తాయి.

చక్...చక్... కత్తెర చప్పుడు మొదలైంది. కత్తెర పదునుగా లేదు. దారు పట్టించాలి...

కత్తెర చప్పుడు విని కొడుకు సారంగం లేచాడు. సాయం చేస్తానని వస్తే తల్లి ఇంటిపని, బీడీల పని ముట్టనివ్వదు. సారంగమే తల్లిని బుజ్జగించి పక్కన కూర్చుని అప్పుడప్పుడు బీడీలకు దారం కడుతాడు. బీడీల మూతులు వొత్తుతాడు. ఆకులు కత్తిరిస్తుంటే దారు పట్టిన కత్తెర, మొండి కత్తెర చేసే శబ్దాల్లో భేదం ఉంటుంది. ఆ శబ్దాన్ని గమనించి సారంగం అడిగాడు. "అమ్మా! ఇవ్వాళ కత్తెర సాన పట్టించుకు రానా?'...."

"నువ్వు సదువు మీన మనసు పెట్టు బిడ్డా... గియన్నీ నీకెందుకు?"

"చదువుకుంటనే...చదువుకుంటలేనా... గా మొండి కత్తెరతోనిఎంత కష్టపడ్తాన్నవ్!"

"లెక్కలు పడ్డంక సూద్దాంగాని... నువ్వు ముందుగా లే... లేచి మొగం కడుక్కుని సదువుకో... నమాజై శానా సేపయింది"

తలూపి సారంగం మొహం కడుక్కోడానికి వెళ్ళాడు. కొడుకును చూస్తే కనకమ్మ మనసు తల్లడిల్లుతుంది. భర్తను చూస్తే గుండె చెరువవుతుంది. కళ్లు మత్తడులవుతాయి.

కనకమ్మ భర్త వీరయ్య ఒక ప్రైవేటు దుకాణంలో పనిచేసి నిన్నటిదాకా ప్రభుత్వకల్లు దుకాణంలో తాగేవాడు. కల్లు దుకాణాలు మూసేసిన తరువాత ఇప్పుడు వీధికో బీరు షాపు. తన కష్టాన్నే కాదు... భార్య కష్టాన్ని తాగేస్తున్నాడు.

కత్తిరించిన ఆకులను తడి గుడ్డలోనో, గోనెతట్టులోనో చుట్టిపెడుతుంది. అప్పుడే బీడీలు చుట్టడానికి అనువుగా ఆకు వంగుతుంది.

కనకమ్మ ఆకు కత్తిరించి లేచే సరికి పొద్దెక్కింది. వీధిలో అమ్మేవాళ్ళ అరుపులు... కొనేవాళ్ళ పిలుపులు... తరువాత కొన్నవాళ్ళ అరుపులు... అమ్మే వాళ్ళ పరుగులు...బాకీ వసూలు చేయడానికి, వడ్డీలు వసూలు చేయడానికి వచ్చిన వాళ్ళ కంచుగొంతులు... కర్కశపు గొంతులు...మేకల పబ్బతి గొంతులు... సైకిళ్ళ గణగణలు... వీధంతా సందడిగా వుంది.

ఆ రోజు ఆదివారం కనుక కొడుకు బడికి పోలేదు. పొద్దున్నే చేట ముందేసుకుని బీడీలు చేయడానికి కూర్చున్నది కనకమ్మ. కొడుకు 'కాళ్లల్ల' పని తొందరగా అవుతుందని ఆమె నమ్మకం.

ఐదు బీడీలు చేసి,వాటికి దారం కట్టి మూతులు వొత్తి "ఇక చాలు బిడ్డా" అన్నది.

తల్లి బీడీల చేటకు ఎదురుగా నిల్చున్న సారంగం దగ్గరకి వచ్చి పక్కన కూర్చున్నాడు.

"ఇయ్యాల ఆడుకోను పోవా?" తల్లి అడిగింది.

"ఉహూ"

"ఆడుకోబుద్ధి అయిత లేదా? ఎట్లున్నది బిడ్డా"

"మంచిగనే ఉన్నదే..."

"..."

"అమ్మా..."

"ఆ..."

"దారం కడ్తనే..."

"వొద్దు బిడ్డా... ఈ పొగాకు ఘాటు నీకు పడది" తల్లి వారించింది.

"ఏం కాదే... కొంచెం సేపే"

తల్లి చేతిలోని బీడి తీసుకున్నాడు సారంగం. దాని తోక వైపు దారం చుట్టి చేటలో వేశాడు. తల్లి చేసే బీడీలను అందుకుని దారం చుడుతూ తన ముందున్న చేటలో వరుసగా పేర్చుతున్నాడు. వాటి మూతులు వొత్తడం కూడా నేర్చుకున్నాడు. ఆకులు కత్తిరించ నివ్వదు తల్లి. మొండికత్తెర. పదునుగా లేదు. ఆ కత్తెరను దారు పట్టించాలి.

కనకమ్మ అన్న వెంకటేశం ఒక కమ్యూనిస్ట్ లీడర్ కారు డ్రైవర్. తీరిక ఉందేమో - చెల్లిల్ని చూసిపోదామని వచ్చాడు.

అల్లుడు బీడీలకు దారం కడ్తుండటం గమనించి...

"అయ్యయ్యో! గా పని వీడితో చేయిస్తున్నావా చెల్లె?" అన్నాడు.

"అమ్మ వొద్దన్నది మావయ్య. నేనే దారం కడుతున్నా. అమ్మకు సాయం చేయొద్దా మావయ్యా?" సారంగం మేనమామ మొహం చూస్తూ అడిగాడు.

వాళ్ళకు ఎదురుగా స్టూలు మీద కూర్చుంటూ - "ఈ పొగాకు పనికి మీ అమ్మ ఊపిరి తిత్తులే చెడిపోతున్నాయి. నీ లేత పాణం ఏం కావాలె. లేలే...ఆ చేతులు లైఫ్‌బాయి సబ్బు పెట్టి కడుక్కొని రాపో" అన్నాడు వెంకటేశం.

అల్లుడు చేట ముందునుంచి లేవలేదు.

"పైగా బాలకార్మికుల నిరోధ చట్టం వచ్చిందిరా. బాలలు పని చేయకూడదు" వెంకటేశం దస్తీతో గాలి విసురుకుంటూ అన్నాడు.

"ఆ చట్టాలన్నీ బయట మావయ్యా ఇంట్లో కాదు. పిల్లలు సాయం చేయకపోతే ఇంటి పనులన్నీ తల్లులే చేయాలా?"

"ఇంటిపనులు ఏమైనా చేయి. ఈ బీడీల పని మాత్రం చేయకు. నువ్వు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తావు అనుకుంటే... ఛీఛీ ఇదేం పనిరా. నువ్వైనా చెప్పు చెల్లే.. వీడు పెద్ద ఆఫీసర్ కావాలా లేదా?"

"మనం అనుకుంటే అయితడా అన్నా. ఏదైనా వానితలరాత ఎట్లున్నదో ఏమో!"

చెల్లెలు నిర్వేదంగా మాట్లాడేసరికి గయ్‌న లేచాడు వెంకటేశం.

"నువ్వు మాటి మాటికి తలరాత అనకు చెల్లే. అన్నీ మన చేతుల్లో ఉన్నాయి. తల రాత లేదు గిలరాత లేదు. అసలు నన్నడిగితే ఈ పొగాకు వల్ల మీ ఆరోగ్యం దెబ్బతింటున్నందుకు నష్టపరిహారం చెల్లించమని మీ యాజమాన్యంతో పోరాడాలి."

నోట్లో బీడీ పెట్టుకుని అగ్గిపెట్టె కోసం చూశాడు.

"మావకు అగ్గిపెట్టె ఇయ్యిబిడ్డా. అట్లనే మంచినీళ్లు తెచ్చియ్యి" కొడుక్కు చెప్పింది కనకమ్మ.

సారంగం చేట ముందునుంచిలేచి మామకు అగ్గిపెట్టె తెచ్చి ఇచ్చాడు.

వెంకటేశం బీడి ముట్టించుకున్నాడు.

"అసలు నన్నడిగితే నువ్వు బీడీల పని మానెయ్యాలె చెల్లె. నీ ఆరోగ్యం ముఖ్యం. అంతే"

"ఆ మాటే ఇరవై ఏండ్లనుంచి అంటనే ఉన్నవ్. బీడీల పని బందుపెడితే ఎట్ల నడుస్తది చెప్పు?"

"మీరు మానెయ్యరే. అసలు ఈ బీడీల కార్ఖానాలే మూసెయ్యాలి"

"అప్పుడు నువ్వు బీడీలు ఎట్లా తాగుతావు మావయ్యా!" బీడీ పొగ వొదుల్తున్న మామకు మంచినీళ్ల చెంబు అందిస్తూ అడిగాడు సారంగం.

"బీడీలు మానేసి సిగరెట్లు తాగుతా"

"బాగున్నది – కల్లు మానేసి బరాండి తాగుతా అన్నట్లున్నది" నవ్వింది కనకమ్మ.

నాలిక్కరుచుకున్నాడు వెంకటేశం.

బీడీ మాత్రం వొదల్లేదు.

అన్న అట్లా వాదిస్తూనే వుంటాడు. ఈ బతుకు బండి ఒడిదుడుకులతో ఇట్లా నడుస్తూనే ఉంటుంది అని కనకమ్మకు తెలుసు.

ఆ మాట ఈ మాట మాట్లాడి మరొక్కసారి మీకు నష్ట పరిహారం చెల్లించాలి. మీ యాజమాన్యంతో పోరాడాలి అని చెల్లెలికి గుర్తు చేసి వెంకటేశం వెళ్ళిపోయాడు.

మామయ్య వెళ్ళిన తరువాత సారంగం ఆటకు బయటికి పోలేదు.

తల్లి దాపున్నే కూర్చొని బీడీల చేట అందుకున్నాడు. దారాలు కట్టడానికి చేయి చాపాడు.

"జరసేపు ఆడుకోని రారాదు బిడ్డా" తల్లిగొంతులోని అనునయం చూసి సారంగం...

"అమ్మా!" అని ఏదో చెప్పడానికి సంశయించాడు.

"చెప్పు బిడ్డా"

"అమ్మా..."

"చెప్పు కొడకా"

"అమ్మా! మరే...రేపు బడి ఫీజు కట్టాల్నే. రేపే ఆఖరి రోజు. కట్టకపోతే బడికి రానివ్వరే" అన్నాడు.

కనకమ్మ కడుపు దేవినట్లయ్యింది. పేగులవిసి పోయాయి.

ముక్కుతూ మూల్గుతూ ఆ పొగాకు పనిచేసి రెండు పైసలు దాచుకుంటే...పోపు డబ్బాలోని ఆ డబ్బులుకూడా ఎత్తుకపోయి తాగుతున్నాడు భర్త.

"రేపటి వరకు కద్దువు తీయి బిడ్డా" అని కొడుకును బుజ్జగించిందే కాని రేపటి వరకు డబ్బులు ఎట్లా వస్తాయన్న ఆలోచనలో పడింది కనకమ్మ.

నిజానికి ఆరోజు లెఖ్ఖలు పడాలి.అప్పటిదాకా చేసిన బీడీలకు కూలీ కట్టి ఇచ్చే రోజు.

కాని... "సేటు ఢిల్లీకి పోయిండంట. ఎప్పుడొస్తడో ఏమో. సేటు వొస్తేగాని లెఖ్ఖలు పడయి." తోటి కార్మికులు అనుకుంటున్న మాటలు వినిపించాయి. కుడితిలో పడిన ఎలుకలా కనకమ్మ పాణం కొట్టుకున్నది.

"ఎట్లా ఏం చేద్దును?

ఏది దారి?

తనలో తాను మధన పడుతూనే కొడుక్కు ధైర్యం చెబుతున్నది.

"కద్దువు బిడ్డా... రంది పడకు"

సారంగం రంది పడలేదు. తన చదువు కోసం తల్లి పడుతున్న కష్టాలను తలచుకుంటున్నాడు.

తల్లికి ఫీజు గురించి చెప్పి బాధపెట్టలేక ఇన్ని రోజులు చెప్పలేదు.

ఆస్తులు లేని వారికి అప్పులు పుట్టడం కష్టం.

ఆస్తులు వున్నవాళ్ళను మరింత ఉన్నవాళ్ళను చేయడానికి అప్పులు క్యూలో

నిల్చుంటాయి. లేని వాళ్ళకు అవి చేరలేని దూరం, ప్రమాదం.

కొడుకు ఫీజు ఎట్లాకట్టాలా అని ఆలోచిస్తున్న కనకమ్మకు లత గుర్తుకొచ్చింది. నెలకు యాభై,నూరు రూపాయలు బీడీ కార్మికుల దగ్గర వసూలు చేసి లత చిట్టీలు నడుపుతుంది.

అవసరం ఉన్నవాళ్ళు ప్రతినెలా చిట్టీ పాడుకోవచ్చు. పాటలో చిట్టీ రాకపోయినా అవసరానికి అప్పు ఇస్తానని లత భరోసా ఇచ్చింది. ఆ భరోసాతో కనకమ్మ వంటి బీడీ కార్మికులు ఆమె దగ్గర చిట్టీ వేస్తున్నారు.

ఆ క్షణంలో లత దేవతలా గుర్తుకు వచ్చింది కనకమ్మకు...చేట ముందు నుంచి లేచి...

"ఇప్పుడే వొస్తకొడుకా, నువ్వు ఇంట్లనే ఉండు" అని చెప్పింది. గబ గబ రెండు వీధుల అవతలి లత ఇంటికి వెళ్ళేసరికి...ఆ ఇంటి ముందు కనకమ్మ వంటి జనం...చిట్టీలు వేసిన బీడి కార్మిక జనం గుమికూడి ఉన్నారు. మూడేండ్లుగా కార్మికుల దగ్గర వసూలు చేసిన లక్షలాదిరూపాయలతో లత 'పరారైందని' తెలిసింది.

అక్కడ గుమికూడిన జనం నెత్తినోరు బాదుకుంటున్నారు. కష్టించి, చెమటోడ్చి కూడబెట్టిన డబ్బును లత గద్దలా తన్నుకపోయింది.

ఆ గుండె ఘోష వినేదెవ్వరు?

ఆ కన్నీళ్ళను తుడిచేదెవరు?

కో ఆపరేటివ్ బ్యాంకులు మూతపడి కోట్లను తన్నుకపోతే డిపాజిటర్లను ఎవరాదుకుంటున్నారు?

ఆ జనంలో ఒక ఆకారమై స్థాణువులా నిల్చుండి పోయింది కనకమ్మ. ఒకటా రెండా వేయి రూపాయలకు పైగా పోగొట్టుకున్నది. వచ్చే సంవత్సరం కొడుకును పెద్ద బడిలో వేయాలి. వాడికి మంచి దుస్తులు కొనాలి. ఎన్నో అనుకున్నది. వారి ఆశయాలను ఆశలుగా, ఆశల్ని అడియాశలుగా చేసే లతలు కోకొల్లలు.

కండ్లల్లో నీళ్లు కుక్కుకొని ఇల్లు చేరింది కనకమ్మ.

"అమ్మా... ఏడికి పోయినవే" సారంగం వచ్చాడు ఎదురుగా.

తల్లి నోట మాట రాలేదు.

"అమ్మా... అట్లెందుకున్నవే?" తల్లి నడుము చుట్టూ చేతులు వేసి గోముగా అడిగాడు.

"ఏం లేదు బిడ్డా" కొంగుతో కళ్లు తుడుచుకుంటూ ఇంట్లోకి నడిచింది కనకమ్మ.

బీడీల చేట మోకాళ్ళ మీద పెట్టుకుని కూర్చున్నది.

కళ్లు మసకబారి పోయాయి.

కొడుకు అధైర్యపడతాడని పొంగివచ్చే దుఃఖం ఆపుకుంది.

ఆకు తీసి... పొగాకు వేసి బీడి చుట్టి తోక వొత్తి, దారం కట్టబోతుంటే సారంగం అందుకున్నాడు.

కొడుకు మరునాడు కట్టవలసిన బడి ఫీజు గుర్తుకు వచ్చింది. కొడుకుపై చదువుల కోసం చిట్టీ వేస్తే లత మోసం చేసింది.

'నా కొడుకు నోటికాడి బుక్క అందుక పోయింది కదా' దుఃఖం ఆగలేదు.

❊❊❊

మనసు బిగపట్టుకుని బిగపట్టుకుని శక్తినంతా కూడదీసకుని చేసిన బీడీలు కట్టలు కట్టి కార్ఖానాలో ఇచ్చిరావడానికి బయలుదేరింది కనకమ్మ.

ఆరోజు కొడుకు సాయం చేయడం వలన పదిహేను వందల బీడీలైనాయి. ఆ పదిహేను వందల బీడీలకు కూలి వస్తుందని గ్యారంటీ లేదు.

"బరబర బీడీలు గుంజేస్తడు. వాని చేతులు మండ" బీడీలు చేసే ఆడవాళ్లు ఆ బీడీలు తీసుకునే కార్ఖానా గుమాస్తాను తిట్టిపోస్తారు.

ఒక బీడి కట్టలో ఇరవై ఐదు బీడిలుంటాయి. తీసుకపోయిన బీడీ కట్టలను గంపల్లోనో, సంచుల్లోనో గుమాస్తా ముందు ఉంచితే... తోక బాగా లేదని, మూతి బాగా లేదని, ఆకు బాగా లేదని, పొగాకు తక్కువైందని, ఎక్కువైందని, నానా వంకలు పెట్టి ఆ కట్టల్లోంచి బీడీలను తీసి పక్కన పెట్టేస్తాడు. అట్లా ఒక్కొక్కరు చూపించే బీడిల్లోంచి వంద, రెండొందలు, మూడొందలు తీస్తాడు. గుమాస్తా ఇష్టారాజ్యం. అట్లా తీసే బీడీలకు కూలీ ఉండదు.

ఆ బీడీలకు ఆకు కత్తిరించి, పొగాకు పోసి, బీడీ చుట్టి, తోకను వొత్తి, మూతిని వొత్తి, కట్టలు కట్టిన శ్రమంతా వృథా. గుడ్లల్లో నీళ్ళు కుక్కుకుని కుమిలిపోతారు బీడీ కార్మికులు.

"బాగానే ఉన్నయ్ కదన్నా..." అని దీనంగా అంటే నాకు ఎదురు మాట్లాడ్తానావ్, అని మరిన్ని బీడీలు తీస్తాడు. కుక్కిన పేనులా ఉండాలి. కిక్కురు మనడానికి వీల్లేదు.

ఎన్నో ఏండ్ల నుంచి బీడీ కార్మికులు ఆ శ్రమ దోపిడీకి గురవుతూనే ఉన్నారు.

గుమాస్తాకు యాజమాన్యం నుంచి మెప్పు ఉంటుంది. టిప్పు ఉంటుంది. అట్లా తీసే బీడీలను చెత్తకుప్పలో పడవేస్తారా అంటే అదీ లేదు. మిగతా బీడీలతో పాటు, తీసిన ఆ బీడీలను కూడా దోర దోర నిప్పు శెగమీద బేకరీలో రొట్టెలను కాల్చినట్లు కాల్చి ప్యాక్ చేసి అమ్ముకుంటారు. ఆ బీడీలను చేసిన కార్మికులకు మాత్రం పైసాదక్కదు. తెలివైన దోపిడీ.

ఆరోజు కుమిలిపోవడం కనకమ్మ వంతయింది. "ఇదేందన్నా... ఈ బీడీలకు ఏమైందన్న" అంటుంటే మరిన్ని బీడీలు తీసేశాడు గుమాస్తా. 'ఎక్కువ తక్కువ మాట్లాడితే ఆకు బందు చేస్తా' అని బెదిరించాడు.

వేటగాడి తూటా తగిలిన పక్షిలా విలవిల్లాడింది కనకమ్మ. నోట్లో కొంగు కుక్కుకుని తీసిపడేసిన బీడీల వంక బాధగా చూసింది. ఆ బీడీలు తన వంక జాలిగా చూస్తున్నట్లు అనిపించింది.

లత చేసిన మోసానికి గుండె పగిలి ఏడుస్తుంటే, గుమాస్తా కసాయితనం రంపంలా కోసేస్తున్నది. లత ఒకరకంగా దోచుకుంటే గుమాస్తా మరో రకంగా... భర్త ఇంకొక రకంగా...

దోషులు బాగానే ఉంటారు. దొంగలు బాగానే ఉంటారు. లతలు... గుమాస్తాలు.. భర్త బాగానే ఉంటారు.. అమాయకులకు గుండె దడలో... మనసు గుబులు.. బతుకు మండే కొర్కాసు... తిట్లు... పిడిగుద్దులు...ఛీ ఏం బతుకు అనిపిస్తుంది. కొడుకు ఉన్నాడు కదా... లంగరు ఉన్నాడు కదా. తానేమైనా అయితే కొడుకు ఆగమైపోతాడు. చేరదేసే చేతుల్లేవు, అరులు చూపే ఎదల్లేవు.. తడి చూపుల్లేవు. ఎడారులున్నాయి ఎండమావు లున్నాయి. ఎదురుదెబ్బలున్నాయి. బతకడమంటే ఎత్తు.. ఎత్తు.. ఎత్తు.. ఎక్కుతూ.. ఎక్కుతూ..

"ఏంది కనకమ్మా.. గంట్ల కూసున్నవు?" తొటి బీడీ కార్మికురాలు పలకరించింది.

కనకమ్మ కండ్లకు అప్పుడు పరిసరాలు కనిపించాయి. గుండె బరువుగా ఉంది. మనసు బావురుమంటున్నది. ఆ రోజంతా ఏడుపే. లత చిట్టీ డబ్బులు దోచుకుని పారిపోవడం, గుమస్తా రెండొందల బీడీలు తీయడం.. దెబ్బ మీద దెబ్బ పడినట్లయింది. కనకమ్మ గొంతు మూగబోయింది. కళ్లకు చీకట్లు కమ్ముకున్నాయి. కొడుకు బడి ఫీజు మనసులో మెదిలింది.

అంతలో.. చీకట్లో చిరుదీపంలా ఒక మాట వినిపించింది. 'సేటు వచ్చిండట..

ఇయ్యాల లెక్కలు ఇస్తాండ్లు.'

ఆ రోజు లెక్కలు ఇస్తారు అనే మాట కనకమ్మ ప్రాణాన్ని నిలబెట్టింది. రెపరెపలాడే దీపం ప్రమిదలో ఒక చుక్క నూనె వేసినట్లయింది. కూలిపోతున్న గుడిసెను అనుగుంజ నిలబెట్టినట్లయింది. కొడుకు మొహంలో చిరునవ్వు కనిపించి కనకమ్మ మనసు కుదుట పడింది. వచ్చే లెక్కలు కొడుకు బడి ఫీజుకైనా సరిపోతాయి. వాడి చదువు కొనసాగుతుంది. వాడిని బడి నుంచి తీసేయరు. దోస్తాన్ల ముందు వాడికి అవమానం జరగదు.

అప్పటికే వీధిలైట్లు వెలిగాయి. సాయంకాలం ఆరుగంటలు... ఇంటికి వెళ్ళడం ఆలస్యమవుతుందని దిగులు మొదలైంది. ఒక దిగులు పోతే మరో దిగులు.. మరో గంట ఆగితేగాని కనకమ్మకు లెక్క అందలేదు.

వడివడిగా నడుస్తున్నది కనకమ్మ భయం భయంగా దిగులు దిగులుగా వొదిగి వొదిగి ఇంటికి నడిచి వస్తున్నది.

ఇంట్లో ఆ రోజు ఎన్ని తిట్లున్నాయో, ఎన్ని దెబ్బలున్నాయో, ఎంత లొల్లి ఉందో... తలచుకుంటేనే పంచ ప్రాణాలు పోతున్నాయి.

తన దోషం ఏదీ లేకపోయినా ఈ భయం భయం దిగులు బతుకు ఎందుకో కనకమ్మకు అర్థం కాదు. కార్ఖానాలో బీడీలు చూపించడానికి అప్పుడప్పుడు ఆలస్యమవుతుంది. గుమాస్తా సమయానికి ఉండకపోవచ్చు. బీడీలు ఆలస్యంగా తీసుకోవచ్చు. దానికి తన మీద అనుమానం. తాగుబోతుకు ఎంత చెప్పినా ప్రయోజనం లేదు. బండబూతులతో గుండెను తూట్లు తూట్లు పొడిచి.. కొట్టి..

కనకమ్మ అనుకున్నంత అయింది.

తల్లి కోసం ఎదురు చూస్తున్న సారంగం దారిలోనే ఎదురై.. "అమ్మా! నాయినా కోపంగ ఉన్నడు. తాగి ఉన్నడు. కొట్టదమ్మా" దిగులుగా అన్నాడు.

ఇంట్లో జరగబోయే దృశ్యం కనకమ్మకు తెలుసు. ఎంత అల్లరైనా కాని.. ఎన్ని దెబ్బలన్నా పడని సహిస్తుంది. తన కొడుక్కు మరునాడు సమయానికి బడి ఫీజు కడ్తుంది. అదే ఆమెకు ఊరడింపు. ఆ ఆనందాన్ని ఆ సంతోషాన్ని గుండెలో పెట్టుకుని ఎంత బీభత్సాన్ని ఎదుర్కోడానికైనా ఆమె సిద్ధంగా ఉన్నది. లెక్కల డబ్బులున్న చేయిసంచిని బొడ్లో దోపుకుని మీది నుంచి కొంగు వేసుకున్నది.

"లెక్క పడింది బిడ్డా. రేపు బడి ఫీజు కడ్తువు" అన్నది నిబ్బరంగా కొడుకుతో.

"అమ్మా! నాయిన కోపంగా ఉన్నడే. మనం మావ వాళ్ళింటికి పోదాం పదా" అన్నాడు సారంగం.

"నాయినతోటి గోస ఎప్పటికీ ఉన్నదే కాదు కొడుకా. ఇవ్వాళ మావ ఇంటికిపోతే ఎల్లకాలం పోతవా బిడ్డా. మన ఇంటికే పోదాం. ఏవన్నా కానీ"

"నాకు భయమైతాంది. వొద్దమ్మా" తల్లి గదుమపట్టుకుని బతిమిలాడాడు సారంగం.

"భయపడొద్దు బిడ్డా.. మన ఇంటికి మనం పోయేదానికి భయం ఎందుకు?" కొడుక్కి ధైర్యం చెప్పింది కనకమ్మ.

తాను ఏ పరిస్థితినైనా ఎదుర్కోవడానికి మొండి ధైర్యం తెచ్చుకున్నది. కాని కొడుకు ఎంత భీతిల్లిపోతాడో ఏమో!

"నువ్వు మావ ఇంటికి పోయి పొద్దున రా బిడ్డా" అన్నది.

"ఉహు... నిన్ను ఒంటరిగా వొదిలిపెట్టి పోనమ్మా"

"పో బిడ్డా. నాకేదం కాదురా. ఏమయితది బిడ్డా. నాయిన కోపం ఎన్నటికీ ఉన్నదేనాయె. నాయిన తాగుడు ఎప్పటికి ఉన్నదాయె, నాయిన తాగనన్నా తాగించడానికి సర్కారే సిద్ధంగా ఉండె. ఇగ నాయిన ఎట్ల మార్తడు కొడుకా... ఎప్పటి నాయినే.. నువ్వు గవన్నీ పట్టించుకోకు కొడుకా... నువ్వు బాగా సదువుకొని పైకి రావాలె కాదురా... గప్పుడే నీ కన్న తల్లికి మనసు నిండు బిడ్డా!!.

సారంగంకు దుఃఖం ఆగలేదు.

తల్లిని చుట్టేసి వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

కొడుకును ఓదారుస్తూనే ఇంట్లో అడుగు పెట్టింది కనకమ్మ.

"గింత రాత్రిరయింది. ఏడ్నించి వస్తున్నవే" బూతులు అందుకుని కనకమ్మ జుట్టు పట్టుకున్నాడు వీరయ్య.

"కార్ఖాన నుంచే వస్తాన్న" అన్నది కనకమ్మ.

"నీ తల్లి..." బండ బూతులు తిడుతూ "బొంక నేర్చినావ్" అని డొక్కలో తన్నాడు.

"ఓమ్మా... ఓమ్మా..." సారంగం వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

తండ్రి దౌర్జన్యం అర్థమవుతున్న వయసు అది...

కాని తండ్రిని ఎదరించే మనసు కాదు. వయసు కాదు.

కిందపడిపోయి గిల గిల పక్షిలా కొట్టుకుంటున్నది కనకమ్మ. బొడ్లో దోపుకున్న చేయి సంచి వూడిపడింది. చిల్లర చెల్లా చెదరై... నోట్లు బయటికి కనిపిస్తున్నాయి.

"అమ్మో... ఇన్ని పైసలు దాచుకున్నావ్?"

మొహం మీద ఈడ్చికొట్టాడు.

"లెఖ్ఖలు పడ్డై" వెక్కి వెక్కి ఏడుస్తూనే అన్నాడు సారంగం.

"లెఖ్ఖలు పడ్డాయి. గా మాట ముందుగానే చెప్పి పైసలు చేతిల పెడ్తె గిన్న దెబ్బలు కొట్టేటోన్నా" లేఖ్ఖ డబ్బులున్న సంచి గుంజుకున్నాడు కనకమ్మ భర్త.

"నన్నేమన్నా చేయి, నా పాణం తీయిగాని గా పైసలు ముట్టకు" ఆ సంచిని భర్త చేతిలోంచి తీసుకోబోయింది కనకమ్మ.

"ఏ పో..." దూరంగా ఆమెను నెట్టేశాడు.

"పైసలు ముట్టద్దా...నువ్వు నా మనిషివి. నీ పైసలు నా పైసలు. నా ఇష్టం వచ్చినట్టు చేసుకుంట నన్ను అడ్డుకునేదెవరే" సంచిలోని డబ్బంతా చేతిలో గుమ్మరించుకుని జేబులో వేసుకుని ఖుషీగా తాగడానికి బయలుదేరబోయాడు భర్త.

"రేపు సారంగం బడి ఫీజు కట్టాలె. ఆ పైసలు కొంటబోకు"

అడ్డం నిల్చున్నది కనకమ్మ.

"బడీ!... ఫీజా! ఎవడూ సదవడమన్నాడే వాణ్ణి. పీజు లేదు గీజు లేదు. మనిండ్లల సదువులెందుకే. పెద్ద పెద్ద సదువులు సదివినోళ్లకే నౌకర్లు లేవు. వీని కెవడిస్తాడే, వీనికి సదువెందుకే, నీతోపాటు బీడీలు చేయించు నాలుగు పైసలొస్తాయి. లే.. అడ్డం లే"

భార్యను నెట్టివేసి బయటికి వెళ్ళబోయాడు. కొడుకు కోసం తాను పడుతున్న ఆరాటమంతా కళ్లముందే ఆగమైపోతుంటే, దౌర్జన్యంగా అంత నిర్లజ్జగా, నిర్దయగా, బాధ్యతారహితంగా కొడుకు భవిష్యత్తు గురించి భర్త మాట్లాడ్తుంటే... కొడుకు ఫీజు కోసమని భద్రంగా దాచిన తన శ్రమను తన్నుకపోతుంటే...కనకమ్మ రక్తం సలసల మరిగిపోయింది. మొండి ధైర్యం గుండెల్లోంచి తన్నుక వచ్చింది.

"మర్యాదగా ఆ పైసలు అక్కడ పెట్టి పో"

నిప్పులు కక్కే కళ్లతో భర్తను చూసి గర్జించింది కనకమ్మ.

"ఏందె, బెదిరిస్తవా?" మీది మీదికి వచ్చాడు భర్త.

"బెదిరించుడు కాదు. ఆ పైసలు అక్కడ పెట్టక పోతే నీ పాణం తీస్తా." గోడ మేకుకు వేలాడుతున్న కత్తెర అందుకున్నది కనకమ్మ.

మొండి కత్తెర కనకమ్మ రౌద్రరూపం అందుకోగానే పదునెక్కి తళ తళ మెరుస్తున్నది.

వీరయ్య, భార్య రౌద్రకారాన్ని, చేతిలో కత్తెరను చూసి గజగజ వణికిపోయాడు.

అయినా ఇంకా పులుపు చావలేదు.

"ఏందె సంపుతవా...ఏమో లావు బెదిరిస్తున్నావ్..." అని జుట్టు అందుకోబోయాడు.

ఆ చేయిని ఒడిసిపట్టి...

"లెఖ్ఖ పైసలన్నీ అక్కడ పెట్టు..." కత్తెర ఎత్తిపట్టింది కనకమ్మ.

వెన్నుపూస నుంచి వణుకు...

ఆమె శక్తి ముందు తానెంతో అప్పుడర్థమయింది. పులి పంజాకు చిక్కిన నక్కలా బెదిరిపోయాడు వీరయ్య. జేబులో వేసుకున్న లెఖ్ఖ డబ్బులన్నీ తీసి ఆమె చేతిలో పెట్టాడు.

*తానా 2005, నవ్య వీక్లీ, 10-8-2005*